క్లుప్తంగా

ఆర్టీసీ స్థలాల లీజుపై సమావేశం



మాట్లాడుతున్న ఆర్ఎం వెంకటరామం

ఆదోనిటౌన్ : స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో 1.30 ఎకరాల ఖాళీ స్థలం లీజు వ్యవహారంపై ఔత్సాహిక వ్యాపారులతో గ్యారేజీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎం రఫీక్ అహ్మద్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా, ఆర్ఎం వెంకటరామం, జిల్లా అధికారులు పాల్గొన్నారు. డిపో పరిధిలో ఉన్న 1.30 ఎకరాల స్థలాన్ని 15 సంవత్సరాల పాటు లీజు ప్రాతిపదికన కేటాయించనున్నామని, ఆసక్తి గల ఔత్సాహిక వ్యాపారులు పూర్తి వివరాలతో ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేయాలని ఆర్ఎం సూచించారు. టెండర్ దాఖలు ఈనెల 27వ తేదీ మధ్యాహ్నం వరకు సమయం ఉంటుందని చెప్పారు. ఆర్టీసీ నియమ, నిబంధనల మేరకు స్థలాన్ని కేటాయిస్తామన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్ : పట్టణంలోని 25వ వార్డు అమరావతినగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత శనివారం భూమిపూజ చేశారు. ముందుగా చైర్‌పర్సన్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, ఎంఈ నాగ భూషణ్‌రెడ్డి, ఏఈలు, అధికారులు కాలనీలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ మున్సిపల్ జనరల్ ఫండ్స్ రూ.30 లక్షలతో అమరావతినగర్‌లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నాణ్యతతో పనులను పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు.

అలరించిన దాసవాణి



సంకీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

మంత్రాలయం : తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీమఠం సంయుక్తంగా హరికథా పారాయణం, దాస సాహిత్య విభావరి నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. శనివారం శ్రీమఠం ప్రవచన మంటపంలో బెంగళూరుకు చెందిన సినీ నేపథ్య ప్లేబ్యాక్ గాయకులు శ్రీమతి సునీతా మురళి, శ్రీమతి మంగళ రవి, శ్రీమతి సుప్రియా రఘునందన్ బృందం దాసవాణి చేపట్టారు. వారు ఆలపించిన హరి కీర్తనలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో శ్రీమఠం గురు సార్వభౌమ దాస సాహిత్య ప్రాజెక్టు సభ్యులు పద్మనాభ ఆచార్, ప్రాణేష్, అప్పన్నాచార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలి

ఆదోనిరూరల్ : అప్రెంటిషిప్ ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని పీడీఎస్ఓ నాయకులు కోరారు. శనివారం పట్టణంలో పద్మావతి కళాశాల నుంచి సబ్‌కలెక్టర్ ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలియజేసి కార్యాలయ ఏఓ గోవింద్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులకు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు కనీసం వేతనం ఇవ్వాలని, అలాగే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రభుత్వం స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణ అధ్యక్షుడు శివ, మహిళా సెల్ కన్వీనర్ నికిత, కృష్ణవేణి, కళాశాల కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రవీంద్ర, సాయి, వంశీకృష్ణ, శ్రావణి, మాధవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలూ అవసరం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

కౌతాళం: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరం అని ఎంఈఓ శోభ రాణి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలను స్థానిక జెడ్పీ పాఠశాలలో శనివారం హెచ్ఎం ఇమ్మానుయేల్, ఎస్ఎంసీ చైర్మన్ వడ్డెరాముతో కలిసి ప్రారంభించారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెంకాయల వేలం పాట

గోనెగండ్ల: అక్టోబర్ 4, 5, 6 తేదీలలో మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వామి దశమి ఉత్సవం సందర్భంగా టెంకాయలు విక్రయించుకునేందుకు శనివారం వేలం పాట నిర్వహిచంఆరు. ఆలయ పూజారులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో కర్నూలు, బళ్లారి, ఆదోని ప్రాంతాల నుంచి వ్యాపారులు పాల్గొన్నారు. బళ్లారికి చెందిన లక్ష్మి రూ.1.60 లక్షలకు పాట పాడి దక్కించుకుంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భాస్కర్ రెడ్డి, దొరబాబు, రంగముని, కౌలుట్లయ్య, పూజారులు కౌలుట్లయ్యస్వామి, ఓబులయ్య స్వామి, మందకల్లు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తిక్కారెడ్డి.. రెచ్చగొట్టే ధోరణి మానుకో

- 2024 ఎన్నికల్లో మరోసారి ఓటమి తప్పదు
- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిక్కారెడ్డి కార్యకర్తలను రెచ్చగొట్టి గ్రామాల్లో చిచ్చు పెట్టే ధోరణిని మానుకోవాలని, 2024 ఎన్నికల్లో ప్రజలే నిన్ను మరోసారి ఓడిస్తారని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ కుమారి అయ్యమ్మ అధ్యక్షత, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నూతన పింఛన్‌దారులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడటంతో సీఐడీ అరెస్ట్ చేయగా, కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందని.. ఇందుకు తమ పార్టీకి, జగనన్నకు సంబంధం లేదన్నారు. టీడీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజల అండదండలు ఉన్నంత వరకు ఎంతమంది ఏకమై వచ్చినా జగనన్న మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. మీకు మేలు జరిగి ఉంటేనే తమను ఆదరించాలని ప్రజలను కోరిన ఏకైక నాయకుడన్నారు. మా కుటుంబంలోని ఐదురుగు అన్నదమ్ములు పేదల సంక్షేమమే ధ్యేయంగా సేవ చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మండలానికి కొత్తగా 2వేల మందికి పైగా పింఛన్లు మంజూరు చేయించామన్నారు. రెండవ విడుతగా ఇటీవల మరో 299 మందికి పింఛన్లు విడుదలయ్యాయని చెప్పారు.

నీటి పథకాలు ప్రారంభం..

మండల కేంద్రంలోని రంగప్ప గట్టు వద్ద నుంచి ఎన్టీఆర్ కాలనీ, చైతన్య స్కూల్, మైనార్టీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.18లక్షలతో, సిద్దప్ప పాళెం 9వ వార్డులోని బీరప్ప కాలనీ వాసుల కోసం రూ.4లక్షలతో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసి శిలాఫలకాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క కోసిగిలోనే రూ.3.30 కోట్లతో డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయించామన్నారు. రూ.5.42 కోట్లు ఖర్చు చేసి నీటిసమస్యకు పరిష్కారం చూపామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టనగౌడ, జెడ్పీటీసీ పవిత్ర పాటిల్, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఇల్లూరి ఆదినారాయణ, మాణిక్యరాజు, జగదీష్ స్వామి, కోసిగయ్య, కోఆప్షన్ మెంబర్ షౌకత్ ఆలి, నాడుగేని నాగరాజు, ఉరుకుంద ట్రస్ట్‌బోర్డు కమిటీ సభ్యులు మల్లికార్జున గౌడ, బుళ్లి నరసింహులు, అధికారులు పాల్గొన్నారు.



శిలాఫలకం ప్రారంభిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

కౌతాళం: రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనించాలంటే వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ సుబ్బరాజు అధ్యక్షతన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి కొత్తగా 552 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, జెడ్పీటీసీ రాధ ప్రియదర్శిని, కౌతాళం సింగిల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, మాజీ అధ్యక్షుడు కామవరం వీరసేనారెడ్డి, వైస్ఎంపీపీ రామలింగయ్య స్వామి, మండల కోఆప్షన్ సభ్యుడు మాబుసాబ్, బదినేహాల్ లక్ష్మిరెడ్డి, నాయకులు ఏకాంబరెడ్డి, రామన్నగౌడ్, సుధాకర్ రెడ్డి, సోమిరెడ్డి, గురునాథరెడ్డి పాల్గొన్నారు.



కౌతాళంలో నిర్వహించిన సమావేశానికి హాజరైన ప్రజలు

ముగిసిన సామాజిక తనిఖీ బహిరంగ విచారణ

- సిబ్బంది పొరపాట్లతోనే తప్పిదాలు
- రూ.97,765 రికవరీ
- రూ.56,250 జరిమానా
- రూ.67,490 వసూలు



సామాజిక తనిఖీ బహిరంగ విచారణలో పాల్గొన్న అధికారులు

ఆదోనిరూరల్ : మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులపై 16వ సామాజిక తనిఖీ బహిరంగ విచారణ కార్యక్రమాన్ని శనివారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో స్త్రీశక్తి భవన్ ఆవరణలో నిర్వహించారు. కార్యక్రమానికి పీడీ అమరనాథ్‌రెడ్డి, అడిషనల్ పీడీ సలీంబాషా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో 1,475 పనులు జరగగా వేతనాలు రూ.12,51,14,797, మెటీరియల్ పనులకు రూ.34,90,551 చెల్లించామన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ కన్వర్జెన్స్ పనులు 73 జరుగగా మెటీరియల్ కోసం రూ.43,76,1761 ఖర్చు చేశామన్నారు. మొత్తం రెండు శాఖలకు సంబంధించి 1548 పనులు, వేతనాలు రూ.12,51,14,797, మెటీరియల్ కోసం రూ.4,72,52,312, మొత్తం రూ.17,23,67,109 వీటికి సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టామన్నారు. 37 గ్రామ పంచాయతీల్లో జరిగిన ఆడిట్‌లో రూ.97,765 రికవరీ కాగా, జరిమానా రూపంలో రూ.56,250 విధించామన్నారు. ఇందులో బహిరంగ విచారణలోనే రూ.67,490 రికవరీ చేశామని చెప్పారు. సిబ్బంది తప్పిదాల వల్లే పొరపాట్లు జరిగాయని, ఇకపై ఇలాంటి జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేశ్వర్, అంబుడ్స్‌మెన్ చంద్రశేఖర్, ఎస్ఆర్‌పీలు తిరుమలేష్, మల్లికార్జున, ఉపాధి సిబ్బంది, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ఆదోనిటౌన్ : పట్టణంలోని మార్కండేయ ఆలయ సమీపంలో నివాసముంటున్న శారద, సిద్దప్పలకు చెందిన ఇంట్లో గత రాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలింది. ప్రమాదంలో టీవీ, ఫ్రిజ్, కూలర్, ఏసీ, బట్టలు కాలిపోగా, భవనం పైకప్పు దెబ్బతింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శనివారం సిద్దప్ప ఇంటి వద్దకు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్తి నష్టంపై ఆరా తీశారు. అధైర్య పడవద్దని, అండగా తానుంటానని భరోసా ఇచ్చారు.



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

స్థాయిని మరిచి విమర్శలా?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్ : వైఎస్సార్‌సీపీపై విమర్శలు చేసే స్థాయి జనసేన పార్టీ ఆదోని ఇన్‌చార్జ్ మల్లప్పకు లేదని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మండల యూత్ అధ్యక్షుడు నల్లారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం, సీఎంపై ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు, స్థాయిని గుర్తించుకోవాలని సూచించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ టీడీపీని భూస్థాపితం చేస్తామని చెప్పారని, మరి నేడు అదే పార్టీతో పొత్తు ప్రకటించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. నిరాధార వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అక్రమాలు వెల్లడవడంతోనే చంద్రబాబును కోర్టు రిమాండ్‌కు ఆదేశించిందన్నారు. పట్టణ ఎస్సీ సెల్ నాయకులు తాయన్న, పెద్దహరివాణం వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్ సంతోష్, సీనియర్ నాయకులు మధుసూదన్, సర్కార్ పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

పెద్దకడబూరు : మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదివారం ప్రారంభిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ.. ఉదయం కల్లుకుంటలో రూ. 20లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్‌ను, ముచ్చగిరి గ్రామంలో రూ.10.5 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని, అదే గ్రామంలో రూ. 27.33 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్‌ను ప్రారంభిస్తారన్నారు. నౌలేకల్లులో రూ.17.5లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభించనున్నారని చెప్పారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



వెండి అలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోనిఅర్బన్ : పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేసి వెండి కవచంతో అలంకరించారు. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారి గురురాజ ఆచారి స్వామివారికి ఫల పంచామృతాభిషేకంతో పూజలు చేపట్టారు.

కౌతాళం: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి జాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి పూజలను జరిపించారు.

19న వీరభద్రేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్ : ఈనెల 19వ తేదీన వీరభద్రేశ్వర స్వామి జయంతి సందర్భంగా పట్టణంలోని సంతపేటలో వెలిసిన పేట వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం విలేకరులకు తెలిపారు. 19న ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, పల్లకీ సేవ, అల్పాహార ప్రసాదం కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

కోసిగి: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి ఆమోదించాలని ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్ దుర్గప్ప మాదిగ, ఎంఆర్‌పీఎస్ తాలూకా కన్వీనర్ చింతకుంట నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన దీక్ష రెండో రోజు కొనసాగించారు. ప్రకాష్, తిప్పయ్య, ఈరన్న, నరసింహులు పాల్గొన్నారు.

ఆదోనిరూరల్ : ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా చేపట్టిన నిరసన దీక్ష శనివారం మూడో రోజుకు చేరుకుంది. టౌన్ అధికార ప్రతినిధి జి.నరసింహ, పట్టణ కార్యదర్శి ముగుతలి విజయరాజు, నాయకులు చిన్నా, కుమార్, వై.సుధాకర్, నరసింహులు మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22వ తేదీల మధ్య జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. గోవిందరాజులు మాదిగ, బండారు హనుమంతు మాదిగ, ఎంఎస్పీ ఉపాధ్యక్షుడు బాలన్న, వీరేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరిద్దాం

ఆదోని సెంట్రల్: స్వచ్ఛ భారత్‌లో భాగంగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరిద్దామని సహాయక పురపాలక కమిషనర్ అనుపమ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్– స్వచ్ఛ ఆదోని కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చెత్తను రోడ్లపై పారబోయకుండా ఇంటికి చెత్త బండి వచ్చినపుడు తడి చెత్త పొడిచెత్తను వేరు చేసి ఇవ్వాలని చెప్పారు. హెచ్ఎం కె.మల్లికార్జున, పురపాలక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల మధ్య ఘర్షణ

చిప్పగిరి: మండలంలోని ఏబీసీ కెనాల్ ఆయకట్టు రైతులు – నాన్ ఆయకట్టు రైతుల మధ్య శనివారం స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. ఏబీసీ కెనాల్ పరిధిలో చిప్పగిరి, డేగులపాడు, ఏరూరు, మల్లికార్జున పల్లి, రామదుర్గం బెల్డోణ తదితర గ్రామాల్లో 40 కి.మీ మేర రైతులు వివిధ పంటలు సాగుచేశారు. ఆయకట్టు రైతులతో పాటు నాన్ ఆయకట్టు రైతులు సుమారు 600 మోటార్లు కాలువపై ఉంచి నీటిని తోడుకొని పొలాలకు అక్రమంగా వాడుకుంటుండడంతో శనివారం ఏబీసీ కెనాల్ జేఈ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఆయకట్టు రైతులతో కలిసి 13వ కిలోమీటర్ వద్ద నుంచి మోటార్లు తొలగించుకుంటూ వెళ్లగా 10వ కిలోమీటర్ వద్ద ఒక్కసారిగా వందల సంఖ్యలో రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఘర్షణ చోటు చేసుకుంది. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాలను పోలీసులు చెదరగొట్టారు. కాగా రైతులపై ఎలాంటి కేసులు నమోదు చేయలేదని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

ఆదోనిఅర్బన్ : అనుమానంతో భార్యపై రోకలితో దాడి చేసిన కేసులో శనివారం ఆదోని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వన్‌టౌన్ సీఐ విక్రమసింహ తెలిపారు. ఈనెల 11న కనకరాజు తన భార్య ఆశా అలియాస్ మహేశ్వరిని అనుమానంతో రోకలితో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బాధితురాలి ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వివరించారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించండి





మాట్లాడుతున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు, హాజరైన వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు

మంత్రాలయం : వినాయక చవితి వేడుకల్లో ప్రతి ఒక్కరూ పోలీసుల ఆదేశాలు పాటించాలని ఎస్ఐ వేణుగోపాల్‌రాజు సూచించారు. శనివారం సాయంత్రం మండలంలోని ఆయా గ్రామాల వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని చెప్పారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరన్నారు. నిమజ్జనంలోనూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్పంచులు తెల్లబండ్ల భీమయ్య, లక్ష్మయ్య, కల్లుదేవకుంట వెంకటేష్, సూగూరు నరసింహులు పాల్గొన్నారు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పెద్దకడబూరు : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వేడుకలను ప్రశాంతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఉషశ్రీ, డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోనిరూరల్ : మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుకుందామని డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం డీవైఎఫ్ఐ ఆదోని పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ముద్రించిన 'మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం..పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే పోస్టర్‌లను ఆవిష్కరించారు. వైద్యులు మాట్లాడుతూ పర్యావరణానికి హానికరమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులు మట్టి విగ్రహాలు వాడాలని కోరారు. పట్టణ ఉపాధ్యక్షుడు వెంకటేష్, మోహన్, నాయకులు సతీష్, జమీర్, భరత్ పాల్గొన్నారు.

హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలి



కర్నూలులో డీఆర్, ఎస్ఈకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ: గుండ్లకొండ దగ్గర హంద్రీనీవాకు స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ వరకు సాగునీరు ఇవ్వాలని ఏపీ రైతుసంఘం నాయకులు శనివారం కర్నూలులోని కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ, హంద్రీనీవా సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజినీర్‌లకు వినతి పత్రం అందజేశారు. ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ, అధ్యక్షులు బి.వీరశేఖర్, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి మాట్లాడుతూ రాయలసీమ కరువు ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీరు అందించేందుకు హంద్రీనీవా సుజలా స్రవంతి నిర్మాణం చేపట్టారని, హంద్రీనీవా కాలువ ద్వారా వెనకబడిన జిల్లాకు 82 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆయకట్టును నిర్దేశించిందన్నారు. అందులో బాగా వెనకబడిన ఇతర సాగునీటి వనరులు లేని దేవనకొండ మండలంలో 42 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు రూపకల్పన చేశారన్నారు. హంద్రీనీవా మొదటి ఫేజ్‌లో కర్నూలు జిల్లా ఉందని, పందికోన రిజర్వాయర్ నిర్మాణం చేయడం, రిజర్వాయర్ నుంచి ప్రధాన కాలువలు పూర్తి చేశారు తప్ప పంట కాలువలు నిర్మాణం చేపట్టలేదన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- మాతాశిశు సంరక్షణే ప్రభుత్వం ధ్యేయం
- గర్భిణులు, బాలింతలకు నెలకు సరిపడ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేత
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్

కోసిగి: మాతా శిశు సంరక్షణ చర్యలో భాగంగా ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తుంది. ఇందులో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తు సంపూర్ణ ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. మహిళ గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టి 6 నెలల వరకు నెలవారీగా సంపూర్ణ పోషణ కిట్టు అందిస్తోంది. దీంతో పుట్టబోమే బిడ్డ, తల్లి సంపూర్ణ ఆరోగ్య వంతులుగా, బిడ్డ ఎదుగుదలకు దోహదపడుతోంది.

పౌష్టికాహారం ఇలా..

మంత్రాలయం నియోజకవర్గం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం మండలాల్లో మొత్తం 251 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు 3,385 మంది, బాలింతలు 3,463 మంది ఉన్నారు. వీరికి నెల వారిగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ కిట్టును ఒక బ్యాగులో వేసి అందిస్తున్నారు.

ఇందులో నెలకు సరిపడా పౌష్టికాహారంతో కూడిన ఆహార పదార్థాలు అందిస్తున్నారు. అందులో 8 రకాల వస్తువులుంటాయి.. 3 కేజీల బియ్యం, ఒక కేజీ బేడలు, అరలీటర్ నూనె, 2కేజీల రాగి పిండి, 1 కేజీ అటుకులు, 250 గ్రాముల చిక్కీలు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల ఖర్జూరాలు ఉంటాయి. అలాగే నెలకు సరిడేలా 25 గుడ్లు, 5 లీటర్ల పాలు కూడా అందిస్తున్నారు.

ఆరోగ్య సలహాలు, సూచనలు :

ప్రతి అంగన్ వాడీ కేంద్రం పరిధిలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య విషయంలో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి నెలవారీగా బిడ్డ బరువుతో పాటు రక్తహీనత లోపించకుండా మందులు ఇస్తున్నారు.. రక్తం తక్కువ ఉండడం , బరువు తక్కువ ఉండే వారు పోషకాలతో కూడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. బిడ్డ పుట్టిన నాటి నుంచి 6 నెలలకు వరకు వైద్య సిబ్బంది తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తుంటారు.



పౌష్టికాహార పదార్థాలు

పౌష్టికాహారం పై అవగాహన కల్పస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లతో కలిసి గర్భిణులు, బాలింతలకు ప్రతి నెల సమావేశం నిర్వహించి సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. పౌష్టికాహారం తీసుకునే విధానం, ఆరోగ్య సలహాలు ఇస్తున్నాం. అంగన్ వాడీ కేంద్రంలోనే సెలసరిగా సమావేశం నిర్వహిస్తున్నాం.

– లూసమ్మ, అంగన్‌వాడీ సెక్టార్ లీడర్

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టు అందిస్తున్నాం



ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును గర్భిణులు, బాలింతలకు నెలకు సరిపడే సరుకులను ఓ బ్యాగులో వేసి అందిస్తున్నాం. ఇందులో ఎవరు అవినీతి పాల్పడకుండా నేరుగా లబ్ధిదారులకుకు అందేలా ఆన్‌లైన్ ఫొటో అప్‌లోడ్ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. బాలింతలకు ఇంటి వద్దకే వెళ్లి అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్నారు.

– క్యాతాయిని, ఐసీడీఎస్ సూపర్ వైజర్,కోసిగి



కూరగాయలు, ధాన్యంతో తయారు చేసిన పౌష్టికాహార చక్రం

ఇంటి వద్దకే కిట్టు అందించారు



అంగన్‌వాడీ కేంద్రంలో నాకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్టును ఒక బ్యాగులో వేసి ఇంటికే అందించారు. ప్రభుత్వం అందించిన సరుకులన్నీ బాగా ఉన్నాయి. పౌష్టికాహారంతో కూడిన సరుకులు నెలకు సరిపడేలా ఇచ్చారు.

– మంగమ్మ, కోసిగి

ఆరోగ్య సలహాలు ఇస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రంలో ఏఎన్ఎం, ఆశా వర్కర్,కార్యకర్తతో కలిసి నెలకొకసారి ఆరోగ్య సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఆకు కూరగాయలు, పండ్లు పౌష్టికాహారం తీసుకోవాలని చెబుతున్నారు. ప్రతినెల రక్త పరీక్షలు చేసి బిడ్డ బరువును చెక్ చేస్తున్నారు. ఆరోగ్య సలహాలు పాటిస్తున్నాం.

– ఉరుకుందమ్మ, కోసిగి